నేడు సామూహిక కుంకుమార్చన

యాకుత్‌పురా: హరిబౌలి గజానన వ్యాయమ శాల పోచమ్మ, మహంకాళి దేవాలయంలో మంగళవారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన ఉంటుందని ఆలయ కమిటీ ప్రధాన ప్రతినిధి కేడాల దినేష్ తెలిపారు. ఉదయం అమ్మవారికి జరిగే అభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం కుంకుమార్చన ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మహిళా భక్తులు ఉదయం 11గంటలకు సామూహిక కుంకుమార్చన కార్యక్రమానికి హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కాలని పిలుపునిచ్చారు.

ఎస్వీ రామారావు రచనలు స్ఫూర్తిదాయకం

గన్‌ఫౌండ్రీ: అక్షర శిల్పి ఆచార్య ఎస్వీ రామారావు రచనలు స్ఫూర్తిదాయకమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. సోమవారం రవీంద్ర భారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఎంవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆచార్య ఎస్వీ రామారావు సాహితీ సమాలోచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్వీ రామారావు రచనలు సమాజాన్ని ఎంతో ప్రభావితం చేశాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త విహారి, తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ గౌరీ శంకర్, కవి సుధామ, ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు మట్టిగుంట వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ బోనాలు భారీ ఎత్తున నిర్వహిస్తున్నాం

గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢ బోనాల ఉత్సవాలు భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వినోద్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆలయ కార్యనిర్వహణ అధికారిణి వసంతతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గోల్కొండ అమ్మవారికి ఆరో బోనం వరకు లక్షలాది మంది భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందారన్నారు. బల్దియా, జలమండలి అధికారులతో పాటు పోలీసుల సహకారంతో ఇప్పటి వరకు బోనాల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. హుండీ ద్వారా అమ్మవారి ఆలయానికి రికార్డు స్థాయిలో ఆదాయం వస్తోందని పేర్కొన్నారు.

'మా కంపెనీ ఆదాయానికి గండి కొడుతున్నారు'

సుల్తాన్‌బజార్: రెండు దశాబ్దాలకు పైగా పవర్ టెక్స్ టూల్స్ కంపెనీ ప్రత్యేక మోడల్ ప్రాజెక్ట్స్ పేరిట విస్తృతంగా ప్రచారం పొందిందని అయితే ఆ టూల్స్‌ను ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాలలో నకిలీ టూల్స్‌గా విక్రయిస్తున్నారని ఆ కంపెనీ డైరెక్టర్ మనోజ్‌గుప్తా ఆరోపించారు. అయితే కొందరు నకిలీ టూల్స్ విక్రయిస్తూ తమ కంపెనీ ఆదాయానికి గండికొడుతున్నారని అన్నారు. ఈ మేరకు సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9వ తేదీన విజయవాడ వన్‌టౌన్‌లో విజయశ్రీ షాపులో విక్రయించారని అక్కడి పీఎస్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. అక్కడి పోలీసులు ఆ షాప్ గోడౌన్‌లలో దాడి చేసి 276 ప్రొడక్ట్స్‌ను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్రంలో కూడా తమ టూల్స్ నకిలీ టూల్స్‌గా విక్రయిస్తున్నారని అన్నారు. ఈ విషయంపై త్వరలో రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయంపై త్వరలో కొనుగోలుదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్ ఓజా, సేల్స్ మేనేజర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో క్రీడలపై ఆసక్తి పెంచాలి

గన్‌ఫౌండ్రీ: భవిష్యత్ చాంపియన్లను తీర్చిదిద్దాలంటే చిన్ననాటి నుంచే క్రీడల్లో వారికి ఆసక్తిని కలిగించాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. సోమవారం ఎల్బీస్టేడియంలోని తన కార్యాలయంలో ఫ్యూచర్ ఒలింపియన్ సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... సెల్‌ఫోన్ క్రీడలకు బానిసలవుతున్న పిల్లలను క్రీడల పట్ల ఆసక్తి కలిగించాలని సూచించారు. పిల్లల కోసం వివిధ కార్యక్రమాలను రూపొందించి వారిలో క్రీడలపై ఆసక్తిని కలిగించేందుకు కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, సుజాత, అనిత, పద్మావతి, సంస్థ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌ఘాట్ శ్మశానవాటిక సుందరీకరణకు కృషి

గోల్కొండ: కార్వాన్ గణేష్ ఘాట్ హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నామని బయోడైవర్సిటీ మేనేజర్ సైదులు అన్నారు. సోమవారం ఆయన శ్మశానవాటిక ప్రతినిధులతో కలిసి పర్యటించారు. శ్మశానవాటిక సుందరీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రతినిధులతో సమీక్షించారు. శ్మశానవాటికలో పచ్చదనం పెంపొందించాలని సూచించారు. అంత్యక్రియలు చూడటానికి వచ్చే వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఆయన వెంట శ్మశానవాటిక ప్రతినిధులు జొన్న కుంటి మధుసూదన్ తదితరులు ఉన్నారు.



శాంతి స్వరూపిణి.. ఉప్పుగూడ మహంకాళి



గర్భాలయంలో అమ్మవారు, ఉప్పుగూడ మహంకాళి దేవాలయం

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ మహంకాళి అమ్మవారు భక్తుల కోరిన కోర్కెలు తీర్చే శాంతి స్వరూపిణిగా భక్తులచే నిత్య పూజలందుకుంటోంది. పాత బస్తీలో ఎంతో ప్రాచుర్యం పొందిన దేవాలయాలలో ఒకటైన ఉప్పుగూడ శ్రీ మహంకాళి దేవాలయంలో ఈ ఏడాది 76వ వార్షికోత్సవ బోనాలు జరుగుతున్నాయి. ఇక్కడి అమ్మవారిని పూజిస్తే శాంతి సౌభ్రాతృత్వాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరుస్తాయని భక్తుల విశ్వాసం. ఉప్పుగూడ ప్రాంతంలో వెలసిన ఈ అమ్మవారి ఆలయాన్ని 1949వ సంవత్సరంలో నిర్మించారు. అప్పట్లో ఉన్న పూల తోటలు, వ్యవసాయ తోటలలో ఈ దేవాలయం చూడముచ్చటగా కనిపించేది.

◆ ఉప్పుగూడ గ్రామానికి ప్రధాన ద్వారం వద్ద ఈ దేవాలయాన్ని నిర్మించారు. గ్రామంలో ప్రవేశించే ప్రతి వ్యక్తి అమ్మవారిని దర్శనం చేసుకొని ఉప్పుగూడ గ్రామంలోకి ప్రవేశించే వారు. గ్రామంలోని భక్తులంతా కలిసి ప్రతిఏటా కలిసికట్టుగా బోనాలను అమ్మవారికి సమర్పించేవారు.

◆ ఈ దేవాలయంలో ఉమ్మడి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో దేవాలయ కమిటీ సభ్యులు 1991 సంవత్సరం నుంచి ఘట స్థాపనను ప్రారంభించారు. 34 ఏళ్లుగా దేవాలయంలో ఘట స్థాపనను నిర్వహిస్తున్నారు. ఘటస్థాపన చేసినప్పటి నుంచి ఉప్పుగూడ ప్రాంత ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ శాంతులతో వర్ధిల్లుతున్నారు. ఆలయం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో 12 ఏళ్ల క్రితం అదే స్థానంలో కొత్త ఆలయాన్ని నిర్మించారు.

ప్రతి ఏటా అంగరంగ వైభవంగా...

◆ ఉప్పుగూడ పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారికి ప్రతిఏటా క్రమం తప్పకుండా దేవాలయంలో బోనాలు,తొట్టెలను సమర్పిస్తున్నారు. బోనాల రోజున వేల సంఖ్యలో బోనాలు సమర్పిస్తారు. బోనాలతో పాటు మొక్కుబడి ఉన్న భక్తులు ప్రతి ఆది, మంగళ వారాలలో బోనం సమర్పించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని లలితాంబ, జేష్టాదేవి, శ్రీ మహా కాలేశ్వరీ అమ్మవారు, మహాగౌరీ అమ్మవారు, శాకాంబరి దేవి(వారాహి అమ్మవారు), అన్నపూర్ణదేవీ, సరస్వతీదేవీ, లక్ష్మీదేవీ, దుర్గాదేవీ, మహంకాళి అమ్మవార్ల రూపాలలో అలంకరించి ప్రతిరోజు పూజిస్తుంటారు.

అమ్మవారికి శాంతి జరిపించడంతో...

◆ ఉప్పుగూడ పరిసర ప్రాంతాలలో కలరా, అతిసార తదితర అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు కుప్పకూలిపోతున్న సమయమది. ఎన్ని ఆసుపత్రులకు తిరిగినా రోగాలు నయం కాకపోవడంతో ప్రజలు దిక్కుతోచని స్థితిలో సతమతమవుతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో అమ్మవారు ఒక భక్తుడి కలలోకి వచ్చి తనకు శాంతి జరిపించాలని కోరింది. దీంతో భక్తులు దున్నపోతును బలిచ్చి రతిని ఊరి పొలిమెరలో చల్లి చాంద్రాయణగుట్ట ప్రాంతంలోని కుర్మన్‌గుట్టపై పాశం చేశారు. ఈ పాశాన్ని భక్తులందరు నేరుగా నాలుకతో తీసుకున్నారు. దీంతో అప్పుడు అందరి అంటువ్యాధులు నయమయ్యాయని కథనం ప్రచారంలో ఉంది. అప్పటి నుంచి అమ్మవారి మహత్యాన్ని గుర్తించిన భక్తులు ఆమె సేవలో నిమగ్నమయ్యారు.

బోనాలు ఘనంగా నిర్వహిస్తాం..



శుక్రవారం ప్రారంభమైన అమ్మవారి బోనాల ఉత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరిస్తుండడంతో భక్తులు దర్శించుకుంటున్నారు. బోనాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. 20వ తేదీనా బోనాల రోజున అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ శాఖ వారిచే పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. 21వ తేదీనా ఘటం ఊరేగింపు ఉంటుంది. – జనగామ మధుసూదన్‌గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు

'ఈ ఒప్పందం' ప్రభుత్వ విద్యార్థులకు భవిష్యత్



ఒప్పందం పత్రాలను ప్రదర్శిస్తున్న సిటీ కాలేజ్, లెర్నింగ్ పాత్ టెక్నాలజీస్, టీ-హబ్ ప్రతినిధులు

చార్మినార్: యువతలో కృత్రిమ మేధస్సుపై అవగాహన పెంచి నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వ సిటీ కాలేజ్, లెర్నింగ్ పాత్ టెక్నాలజీస్ ఏఐ స్కూల్, టీ-హబ్ హైదరాబాద్ మధ్య సోమవారం ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 10,000కు పైగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఏఐ, జనరేటివ్ ఏఐలో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఒప్పందం కింద గవర్నమెంట్ సిటీ కాలేజ్ నోడల్ ఏజెన్సీగా బాధ్యత తీసుకుంటుంది. ఈ ఒప్పందంలో భాగంగా మెంటర్‌ల ద్వారా ఆన్‌లైన్, వర్చువల్ తరగతులు నిర్వహిస్తామని సిటీ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొ. బాలభాస్కర్ తెలిపారు. అదే విధంగా ఏఐ వ్యవస్థాపకులతో ప్రత్యేక సమావేశాలు, ఏఐ ఐడియాల ప్రామాణీకరణ కార్యశాలలు, ప్రాజెక్ట్ ఆధారిత ప్రాక్టికల్ లెర్నింగ్ ఉంటుందన్నారు.

అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యం..

లెర్నింగ్ పాత్ టెక్నాలజీస్ కో-ఫౌండర్ గంటా శ్రీనాథ్ మాట్లాడుతూ... ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను విద్యార్థులందరికీ అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని అన్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ అయిన సిటీ కాలేజ్‌తో భాగస్వామ్యం ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు అత్యాధునిక నైపుణ్యాలను అందించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు ఉపాధి అవకాశాల మెరుగుపరిచేందుకు మౌలికమైన శిక్షణను అందిస్తుందని పేర్కొన్నారు. 'ఈ ఒప్పందం'ప్రభుత్వ విద్యార్థుల భవిష్యత్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ, అటానమీ సమన్వయకర్తలు డా. జె.నీరజ, డా. బి.రజిత, కళాశాల ఏసీవో డా.వై. వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

'ఉద్యోగుల పనితనమే వారికి గుర్తింపు తెస్తుంది'



ఉద్యోగ విరమణ పొందిన సీహెచ్ఓలను సన్మానిస్తున్న డీహెచ్, సంఘం నాయకులు

సుల్తాన్‌బజార్: ఉద్యోగుల పనితనంతోనే గుర్తింపు వస్తుందని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. సోమవారం ఉద్యోగ విరమణ పొందిన సీహెచ్ఓలను డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సమక్షంలో తెలంగాణ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా రవీంద్రనాయక్ మాట్లాడుతూ..... ఉద్యోగులు తమ సర్వీస్‌లో చేసిన సేవలు ప్రజలకు గుర్తుండి పోతాయని అన్నారు. సీహెచ్ఓలను ఆత్మీయంగా సన్మానించడం అభినందనీయమని పేర్కొన్నారు. వారి బెనిఫిట్ కోసం కృషి చేస్తామని తెలిపారు. సీహెచ్ఓలు కరుణాకర్ గౌడ్, హసన్ మొహియుద్దీన్, పాషా, మనోహర్‌ను సన్మానించి వారికి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు నెహ్రూచంద్ నాయక్, ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జ్ఞానసుందరి, సుధాకర్, సదానందం తదితరుల పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి గురుకులాల్లో సీటు కేటాయించాలి



బీసీ సంక్షేమ భవన్ వద్ద చేపట్టిన నిరసనలో ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

విజయనగర్‌కాలనీ: గురుకుల పాఠశాలలో చదివేందుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన వేలాది విద్యార్థులు విద్య కోసం గురుకుల పాఠశాల వైపు చూస్తున్నారని వారికి న్యాయం చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. సోమవారం మాసాబ్‌ట్యాంక్ డీఎస్ఎస్ భవన్ వద్ద బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు గిల్లపల్లి అంజి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆర్. కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాష్ట్రంలో 119 గురుకులకు అదనంగా మరిన్ని గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వసతులు ఉన్న పాఠశాలలో అదనపు సెక్షన్లు ప్రవేశపెట్టాలని ఆయన కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రోజులు గడుస్తున్నా నేటికీ గురుకులాల్లో విద్యార్థులను చేర్పించేందుకు వారి తల్లిదండ్రులు కార్యాలయాలు చుట్టు తిరుగుతున్నారని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని కొందరు దళారులు అందినకాడికి దండుకుని మోసాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ జనాభాకు అనుగుణంగా బీసీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు అరవింద్, వెంకట్, శివ, నరేష్, కౌశిక్, నిఖిల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి

గౌలిపురా: సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రతి విద్యార్థినీలు అవగాహన కలిగి ఉండాలని భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి సూచించారు. సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ గరల్స్ ఎడ్యూకేషనల్ క్యాంపస్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి మాట్లాడుతూ... సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, స్నాప్‌చాట్, ట్విట్టర్, వాట్సాప్‌లలో మంచి, చెడు రెండు ఉంటాయని... మనం మంచికి అవసరానికి వాడుకోవాలన్నారు. గూగుల్ పే, ఫోన్ పేల నుంచి డబ్బులు పోయాయని తమకు తరుచూ ఫిర్యాదులు అందుతాయన్నారు. వాట్సాప్ డీపీలను తమ ఫోటోలను పెట్టుకోకూడదని... సైబర్ నేరగాళ్లు వాటిని ఆసరాగా చేసుకొని మోసాలు, వేధింపులు, బ్లాక్ మెయిలింగ్‌లకు పాల్పడుతుంటారని.. వీటిపై ప్రతి ఒక్క విద్యార్థినీలు అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహ హింస, అత్తారింటి వేధింపులపై ఉమెన్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ నిర్వాహకులు అవగాహన కల్పించారు. ఎలాంటి పోలీసులకు ఫిర్యాదులు చేసి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు హసీనా, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు



ప్రజావాణిలో ఫిర్యాదు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ టి. వెంకన్న

చార్మినార్: తమకు అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చార్మినార్ జోనల్ కమిషనర్ టి. వెంకన్న అన్నారు. జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న ప్రజలకు సూచించారు. చాంద్రాయణగుట్ట నర్కి ఫూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ఆయన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మలక్ పేట్, సంతోష్ నగర్ సర్కిళ్ల పరిధిలో అక్రమాలను అక్రమ నిర్మాణాలపై 4, సంతోష్ నగర్ సర్కిల్ పరిధిలో డ్రైనేజీ పైపు నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ మరో ఫిర్యాదుతో కలిపి మొత్తం 5 ఫిర్యాదులు అందాయి.

◆ ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి సోమవారం ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. చార్మినార్ జోన్ పరిధిలోని మలక్ పేట్, సంతోష్ నగర్, చాంద్రాయణ గుట్ట, చార్మినార్, ఫలక్ నుమా, రాజేంద్ర నగర్ సర్కిళ్ల పరిధి లోని ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజావాణి కార్యక్రమంలో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ డి.శంకర్సింగ్, ఎస్ఈ మహేశ్వర్రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ విష్ణువర్ధన్, టౌన్‌ప్లానింగ్ సీపీ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, టౌన్ప్లానింగ్ సర్కిల్- 9, 10 ఏసీపీలు రాందాస్, మెహ్రా, వెటర్నరీ సీనియర్ అసిస్టెంట్ హమీద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న శ్యాంరావు ముదిరాజ్

చాంద్రాయణగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ బోనాల జాతర ఉత్సవాలలో భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారని గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ అన్నారు. రూ.9 లక్షల వ్యయంతో చేపట్టిన జంగమ్మెట్‌లోని ఈదమ్మ దేవాలయంలో సీసీ రోడ్డు పనులు, ఎస్ఎస్ ఫ్లోరింగ్ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.....ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సుఖ శాంతులతో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన జోనల్ కమిషనర్ వెంకన్న, ఈఈ సలావుద్దీన్, ఏఈ బిందు లకు ధన్యవాదాలు తెలిపారు.

మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బోనాలు



పోతురాజు విజయ్ ముదిరాజును సన్మానిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

చార్మినార్: బోనాల పండుగ మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. 32 సంవత్సరాలుగా నిర్విరామంగా పోతురాజుగా సోమ విజయ్ ముదిరాజ్ వేషం ధరించి అమ్మవారి సేవలో ఉండటం గొప్ప విషయమని కేంద్రమంత్రి అన్నారు. గోల్కొండ, సుల్తాన్ షాహి, గౌలిపుర దేవాలయాలతో పాటు వివిధ జిల్లాలలో జరిగే బోనాల్లో పోతురాజు సోమ విజయ్ తన విన్యాసాలతో మంత్రముగ్ధులను చేస్తారన్నారు. ఈ సందర్భంగా పోతురాజు సోమ విజయ్‌ను సోమవారం కేంద్రమంత్రి జ్ఞాపకను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా సోమ విజయ్ పోతురాజు మాట్లాడుతూ.. పోతురాజుగా తన సేవలను గుర్తించి సన్మానానికి ఎంపిక చేసిన తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు ఎన్. గౌతమ్ రావువు, ఎం.శాంరాజ్ ముదిరాజ్, రాజిరెడ్డి, నందకిషోర్ యాదవ్, ప్రవీణ్, సునీల్, కౌన్సిల్ కోఆర్డినేటర్లు జి.మణికంత, మల్లికార్జున్, జి.వేణుగోపాల్ ముదిరాజ్, జగదీశ్వర్‌చారి తదితరులు పోతురాజును అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

గురువులకు సంగీత కళాభారతి పురస్కారాలు



సుల్తాన్‌బజార్: గురువులచే నేర్చుకున్న కళలు భవిష్యత్తును ఇస్తాయని స్వరభారతి అధ్యక్షుడు గాడేపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్వరభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురువుల వద్ద సంగీతం నేర్చుకున్న శిష్యులు తమ గురువులను సత్కరించుకున్నారు. గురువుల వద్ద అభ్యసించిన సంగీతంతో గురు పరంపరకు సంబంధించిన శ్లోకాలు, గీతాలు పాడి వారి గురు భక్తిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్వరభారతి ఫౌండేషన్ గురువులైన పద్మావతి, శారద, రేవతి, ఇందిరా, సుబ్రమాణ్యం తదితరులకు సంగీత కళాభారతి పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కొడాలి వెంకటేశ్వర్‌రావు, సుబ్రమాణ్యం, హరికృష్ణ, రాధాకుమారి, గడిపల్లి సంధ్య, ప్రసన్న, దివ్య తదితరులు పాల్గొన్నారు.

'సైకాలజీ రంగాన్ని ఉన్నతస్థాయికి విస్తరించారు'

బీవీ పట్టాభిరాం సంస్మరణ సభలో కేవీ రమణాచారి




బీవీ పట్టాభిరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రపంచ స్థాయిలో తెలుగువారి కీర్తిని డాక్టర్ బీవీ పట్టాభిరాం ఇనుమడింపజేశారని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మిమిక్రీ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్, హైదరాబాద్ మెజీషియన్స్, యువ తెలంగాణ మెజీషియన్స్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ బీవీ పట్టాభిరాం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయనతో ఉన్న జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం రమణాచారి మాట్లాడుతూ...... సైకాలజీ రంగాన్ని ఉన్నతస్థాయికి విస్తరించడంతో పాటు మ్యాజిక్, మిమిక్రీ, మైమ్ రంగాలను అనుసంధానం చేయడానికి ఆయన తోడ్పాటును అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టాభిరాం తనయుడు భవరాజు ప్రశాంత్, సీనియర్ జర్నలిస్ట్ జ్వాల నర్సింహారావు, సంస్కృతిక సంస్థల ప్రతినిధులు వంశీ రామరాజు, సత్కళాభారతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పోలీసుల పనితీరు అత్యుత్తమం

- సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్
- ఆటో, బైక్ దొంగల అరెస్టు
- మరో ఘటనలో పని మనిషి రిమాండ్



గోల్కొండ: తెలంగాణ పోలీసుల పనితీరు అత్యుత్తమంగా ఉందని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ అన్నారు. టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలకు పాల్పడిన వ్యక్తుల వివరాలు రికవరీ చేసుకున్న సొమ్మును సోమవారం జరిగిన ఆయన వెల్లడించారు. టోలిచౌకీలో వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసుల అమీద్‌ఖాన్ ఆటోను పరిశీలించారు. అతడు సరైన సమాధానాలు ఇవ్వకపోవడంతో పోలీసులు అతడిని విచారించగా హకీంపేట్‌కు చెందిన జువైనల్ నేరస్తుడుగా తేలింది. మూడేళ్ల జువైనల్ హోమ్‌లో అమీద్‌ఖాన్(19) జల్సాల కోసం వాహనాలను దొంగలించడం ప్రారంభించాడు. ఈనెల 9వ తేదీన బృందావన్ కాలనీ వద్ద మస్తాన్ రావు ఆటోను దొంగలించానని అదే ఆటోలో తాను తిరుగుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడించారు. అతడి నుంచి ఆటోను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

పని చేస్తున్న ఇంటికే కన్నం..

పని చేస్తున్న ఇంటికే కన్నం వేసిన పని మనిషిని అరెస్టు చేశామని డీసీపీ తెలిపారు. టోలిచౌకీ అక్బర్‌పురాకు చెందిన సయ్యదా జుటిసన్ నాసిర్ అనే మహిళ తన ఇంట్లో ఐదు తులాల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని ఈనెల 13వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితురాలిని పట్టుకున్నారు. నిందితురాలు గతంలో అదే ఇంట్లో పని మనిషిగా చేసిన దీపికగా తేలింది.కాగా ఆమెను హకీంపేట్‌లోని ఆమె నివాసంలో పోలీసులు అరెస్టు చేశారు.తాను వివాహిత అని అయితే సాయిదీపక్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కలిగి ఉన్నానని విలాసాల కోసం నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులకు తెలిపింది. ఆమె వద్ద నుంచి చోరీ చేసిన నాలుగు లక్షల రూపాయల విలువ గల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు.

బైకులు అంటే ఇష్టం అందుకే..

టోలిచౌకీ ఎస్ఏ కాలనీలో నివసించే షేక్ అహ్మద్ ఇంటి ముందు పార్కు చేసిన జావా ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. బాధితుడు ఈనెల 13వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా విచారణ చేపట్టిన పోలీసులు పక్కా సమాచారంతో జమాలి కుంటలో దొంగలించిన వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా అతడు షేక్ సలీమ్‌గా తేలింది. బైకులు అంటే తనకు ఇష్టమని అందువల్లే బైకులు దొంగలించానని తెలిపాడు. అతడి వద్ద నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ప్రెస్‌మీట్‌లో టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.